నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 18 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

బహుమతులు అందిస్తున్న అన్నమయ్య కళాసమితి ప్రతినిధులు

నకిరేకల్, జనవరి 17 : కళాసమితి నకిరేకల్ ఆధ్వర్యంలో అన్నమయ్య పదసమాకూర్చనం 28వ కార్యక్రమాన్ని సమితి అధ్యక్షురాలు జి. సుమలత ఆధ్వర్యంలో స్థానిక ఐశ్వర్యసాయి కల్యాణ మండపంలో అన్నమయ్య సంకీర్తన పోటీలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో 22 మంది బాలబాలికలు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ప్రతిభ చూపిన బాలబాలికలకు సంగీత దర్శకుడు సాలూరి వాసురావు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్యులు, గాయకుడు రవి వర్మ, కవయిత్రి చక్రవర్తుల రోజాదేవి, కవయిత్రి కొండపల్లి నిహారిక బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు అలపించిన అన్నమయ్య సంకీర్తనలు పలువురిని అలరించాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎంలు

ఎస్ఎంసీతోపాటు నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు

- పాఠశాలల పురోభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులదే కీలక భూమిక
- ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించేలా ప్రణాళిక
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,181 ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థి తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఎస్ఎంసీతోపాటు పీటీఎం(పేరెంట్స్, టీచర్స్ మీటింగ్)సమావేశాలు విధిగా నిర్వహించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలో ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రతి రెండు నెలలకోసారి ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సమావేశాలు నిర్వహిస్తుండగా 2023-24 నుంచి ప్రతి నెలా 3వ శనివారం పీటీఎం నిర్వహించాలని నిర్ణయించింది. దాంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3,181 పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు జరుగనున్నాయి.

–రామగిరి, జనవరి 17

పీటీఎం లక్ష్యాలు ఇవే..

- పాఠశాల తల్లిదండ్రులతో అనుసంధానికి పీటీఎం దోహదం చేస్తుంది.
- తరగతి వారీగా ప్రతి నెలా 3వ శనివారం అన్ని తరగతులకు పీటీఎం నిర్వహించాలి. ఒకవేళ ఆ రోజు సెలవు వస్తే 4వ శనివారం నిర్వహించాలి. ఇందులో పిల్లల పురోగతి, హాజరు సమస్యలు, ప్రవర్తన, మూల్యాంకనం, ఇతర అంశాలను తల్లిదండ్రులే నేరుగా ఉపాధ్యాయులతో చర్చించడం జరుగుతుంది.
- పిల్లల విద్యాభివృద్ధితోపాటు పాఠశాలలో మెరుగైన ఫలితాలు, మధ్యాహ్న భోజనం మెనూ అమలు పర్యవేక్షణ చేసే అవకాశం కల్పించడంతో నాణ్యతతోపాటు ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెరుగుతుంది.
- ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో క్లాస్ టీచర్ పిల్లల తల్లిదండ్రులతో పీటీఎం నిర్వహించాలి.

పీటీఎంలో చర్చించే అంశాలు..

- విద్యావేత్తలు సహపాఠ్య కార్యక్రమాల ద్వారా విద్యార్థుల పని తీరును అంచనా వేస్తారు.
- మన ఊరు–మనబడి , ఆంగ్ల మాధ్యమం అమలుపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులను స్వయంగా అడిగి తెలుసుకుని సూచనలు చేస్తారు.
- విద్యార్థుల హాజరు మెరుగుపర్చుట, పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజనం అమలు, వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తయారు చేయుట.
- సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చర్చలను రికార్డ్ చేసి మినిట్స్ తయారు చేయాలి.
- తయారు చేసిన అంశాలతో ఉన్న మినిట్స్‌ను ఉన్నతాధికారులకు (ఎంఈఓ, డీఈఓ)కు పంపడం ద్వారా ఆయా పాఠశాలల్లో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

అధికారుల బాధ్యతలు..

అధికారులు నిరంతరం పాఠశాలలను పర్యవేక్షిస్తూ తల్లిదండ్రుల సమావేశాలను కొన్నింటికి ప్రత్యక్షంగా హాజరుకావాల్సి ఉంటుంది. ప్రభుత్వం, విద్యాశాఖ అమలు చేసే విద్యా క్యాలెండర్‌లోని అంశాలను పీటీఎం సమావేశంలో తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ లక్ష్యం అమలయ్యేలా చూడాలి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,181పాఠశాలలు..

నల్లగొండ జిల్లాలో 1,482, సూర్యాపేటలో 918, యాదాద్రి భువనగిరి జిల్లాలో 781 పాఠశాలలు ఉండగా వీటన్నింటిలో పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఎస్ఎంసీతోపాటు పీటీఎం సమావేశాలు విధిగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

అన్ని పాఠశాలల్లో పీటీఎంలు నిర్వహించాలి

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేందుకు విద్యాశాఖ పీటీఎం సమావేశాల నిర్వహణ కోసం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల 3వ శనివారం పీటీఎం నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో చర్చించిన అంశాలను ఎజెండా ప్రకారం చర్చించి నివేదికను ఎమ్మార్సీలో సమర్పించాలి. అలాగే మీటింగ్ ఫొటోలను విధిగా ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉంది.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బాధ్యత..

సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రధానోపాధ్యాయుడు ముందుగా సమావేశమై పీటీఎం ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు వందమంది హాజరయ్యేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలి. నెలవారీ ఎజెండా ప్రకారం చర్చ జరిపేలా చూడాలి. ప్రతి సమావేశంలో చేసిన తీర్మానాలను రిజిస్టర్‌లో నమోదు చేసి తదుపరి సమావేశంలో సమీక్షించాలి. తరగతి ఉపాధ్యాయులు విద్యార్థుల బలాలు, బలహీనతలు గుర్తించి ప్రొఫైల్స్ తయారు చేయాలి. విద్యార్థుల ప్రగతి తెలుపుతూ పాఠశాలలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలు, ఇన్‌స్పైర్, ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈ, ఒలింపియాడ్స్, ఆన్‌లైన్ క్విజ్ గురించి తెలియజేయాలి. విద్యార్థుల విద్యాపరమైన, సాంస్కృతిక, ఆరోగ్య, మానసిక స్థితిగతులు, అభిరుచులు, వైఖరులు, అలవాట్లు మొదలైన వాటిని గుర్తించి చర్చించాలి. అధికారులు నిరంతరం పాఠశాలను పర్యవేక్షిస్తూ తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలి.


యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహుడి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి వైభవంగా తిరువీధి సేవోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరువీధి సేవోత్సవం వైభవంగా సాగింది. బుధవారం సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనం, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు సేవను కొనసాగించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామివారికి దర్బార్ సేవ చేపట్టారు. రాత్రి వేళ స్వామి వారి తిరువరాధన చేపట్టి, స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన జరిపారు. పాత గుట ఆలయంలో స్వామి వారికి నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులతో గుట్ట ప్రాంగణం సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని ఆలయ ఖజానాకు రూ. 29,75,560 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి జైలు

మిర్యాలగూడ, జనవరి 17: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.3.94లక్షల జరిమానా విధిస్తూ మిర్యాలగూడ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి ఎంఎస్ బీఎస్ఎన్ సుమబాల బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ సమీపంలోని పానగల్లు గ్రామానికి చెందిన చింత ఎల్లయ్య తన అవసరాల నిమిత్తం 2018 ఫిబ్రవరి 24న తండు నాగేశ్ వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత నాగేశ్‌కు రూ.3లక్షల చెక్కు ఇచ్చాడు. చెక్కును బ్యాంక్‌లో వేయగా ఎల్లయ్య ఖాతాలో నగదు లేక పోవడంతో అది చెల్లలేదు. ఈ విషయమై నాగేశ్ కోర్టులో కేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన జడ్జి చింత ఎల్లయ్యకు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పల్లె నుంచి పట్టణానికి..

ఎన్‌హెచ్-65పై వాహనాల రద్దీ

చౌటుప్పల్‌లో హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు

చౌటుప్పల్, జనవరి17 : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సెలవులు ముగియడంతో తిరిగి భాగ్యనగరం బాటపట్టారు. దాంతో బుధవారం 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. ప్రధానంగా సూర్యాపేట, చౌటుప్పల్ పట్టణ కేంద్రాల్లో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై తంగడపల్లి రోడ్డు మార్గాన్ని మూసివేశారు. సంస్థాన్ నారాయణపురం నుంచి వచ్చే వాహనాలు హైవే ఎక్కకుండా బంద్ చేశారు. అటు వైపు నుంచి వాహనాలు సర్వీసు రోడ్డు వెంట వెళ్లాయి. స్థానిక బస్టాండ్, వలిగొండ క్రాస్ రోడ్డులో బారికేడ్లు అడ్డంగా పెట్టి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. వాహనాల బారులు దీరితే పూర్తిగా మూసివేసేందుకు కూడా చర్యలు చేపట్టారు. కేవలం పాదచారులకు మాత్రమే రోడ్డు దాటే ఏర్పాటు చేశారు. ట్రాఫిక్, సివిల్ పోలీసులు కలిపి 70మంది రహదారిపై విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 30మంది పైగా జీఎమ్మార్ సిబ్బంది కూడా ఉన్నారు.

టోల్ ప్లాజాల వద్ద..

కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులుదీరి వెళ్తున్నాయి. పంతంగిలో మొత్తం 16 టోల్‌బూత్‌లకుగానూ హైదరాబాద్ వైపు 10 తెరిచారు. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ వాహనాల రద్దీ నెలకొంది. గురువారం నుంచి పాఠశాలలు ఉన్న నేపథ్యంలో ప్రయాణాలు కొనసాగించడంతో ఈ పరిస్థితి కనిపిస్తున్నది. గురువారం తెల్లవారుజాము వరకు ఈ ట్రాఫిక్ ఉండే అవకాశం ఉన్నది.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- 27న గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేయాలి
- ఉపాధి హామీలో కూలీల శాతం పెరిగేలా చూడాలి
- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

మండల అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 17 : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్ (జీపీడీపీ) రూపొందించి ఈ నెల 27లోగా గ్రామ సభల్లో తీర్మానాలు చేపట్టాలని, ఉపాధి హామీ పనుల్లో కూలీల శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల అభివృద్ధి అధికారులు, ఏపీఓలు, టీసీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

గ్రామాల అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో 2024–25 సంవత్సరానికి గ్రామ పంచాయతీ సెక్రటరీ నోడల్ అధికారిగా గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, ఈ నెల 27న గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేయాలని, జనవరి 31 లోగా సంబంధిత పత్రం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల తీర్మానాలను పరిశీలించి గ్రామ పంచాయతీల్లో కవర్ కాని పనులను మండల స్థాయి అభివృద్ధి ప్లాన్ ద్వారా (ఎంపీడీపీ) ఫిబ్రవరి 7వ తేదీలోగా తీర్మానం చేపట్టి 10వ తేదీ లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 16 లోగా తీర్మానం పూర్తి చేసి 20వ తేదీ లోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు, గ్రామ పంచాయతీల అవసరాలు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తీర్మానాలు చేపట్టాలని చెప్పారు. ఉపాధి హామీ పనుల్లో అలసత్వం ఉండొద్దని, గ్రామాల అభివృద్ధికి ఏ పనులు చేపడితే బాగుంటుందో క్షేత్ర స్థాయిలో పనులు గుర్తించాలని, పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలని, గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, కూలీల శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా తీర్మానించిన పనులను త్వరితగతిన ఆమోదం పొంది పనులను ప్రారంభించాలని, ప్రధానమైన పనులు ఫామ్ పాండ్స్, ఫిష్ పాండ్స్, ఇంకుడు గుంతలు, నీటి సంరక్షణ పనులు, వ్యవసాయ అనుబంధ పనులు, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యతనిచ్చేలా పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. పనులకు హాజరయ్యే కూలీలకు వంద శాతం మొబైల్ యాప్ ద్వారా హాజరు చేపట్టాలని, చేసిన పనులకు భువన సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని, ఎంబీ రికార్డులు చేపట్టి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ భారత్ పారిశుధ్యం పనులపై ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలని, మురుగు కాల్వల చివరి భాగంలో ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేసి పారిశుద్యం మెరుగుపర్చాలని తెలిపారు. నర్సరీల్లో అన్ని మొక్కలు వంద శాతం బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవసరమైన కరివేపాకు, కుంకుడు, గంగరేగి, సీతాఫలం, ఈత, బొడ్డుమల్లె, సీత జెడ, కాగితం పూల మొక్కలను నర్సరీల్లో పెంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ప్లాంటేషన్ మొక్కలకు వాటరింగ్ డే నిర్వహించి సంబంధిత ఫొటోలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సీహెచ్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏపీడీ శ్యామల పాల్గొన్నారు.

ప్రాణాల మీదికి తెచ్చిన చైనా మాంజా

భూదాన్ పోచంపల్లిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మెడకు గాయమైన మేకల సునీతా రెడ్డి, రంజిత్ కుమార్

భూదాన్ పోచంపల్లి, జనవరి 17 : చైనా మాంజా ప్రాణాల మీదికి తెస్తున్నది. సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగుల ఎగురవేసేందుకు కొంత మంది నిషేధిత చైనా మాంజాను వాడారు. అవి రోడ్లు, చెట్లపై వేలాడుతూ మనుషులతో పాటు పశుపక్షాదులను సైతం గాయాలపాలు చేస్తున్నాయి. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో బుధవారం చైనా మాంజా తగిలి ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. పోచంపల్లికి చెందిన రంజిత్ కుమార్ స్థానిక విజయదుర్గ రైస్ మిల్లులో హమాలీ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి రైస్ మిల్‌కు బైక్‌పై వెళ్తుండగా మెడకు మాంజా తగిలింది. తీవ్రంగా గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ దవాఖానలో చికిత్స తీసుకున్నాడు. అలాగే శివరెడ్డి గూడెం గ్రామానికి చెందిన మేకల సునీతారెడ్డి వీబీకేగా పని చేస్తున్నారు. పని నిమిత్తం వెలుగు ఆఫీస్‌కు స్కూటీపై వెళ్లి వస్తుండగా చెయ్యి, గొంతుకు మాంజా తగలడంతో తీవ్ర గాయం అయ్యింది. ఆమె హెల్మెట్ ధరించి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నల్లమలలో శాకాహార జంతు గణన

- ప్రారంభించిన ఎఫ్‌డీఓ సర్వేశ్వర్
- మూడు రోజులపాటు నిర్వహణ

రేకులవలయం అటవీ ప్రాంతంలో జంతు గణన చేపట్టిన అటవీ శాఖ అధికారులు

చందంపేట, జనవరి 17 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్డ్ ప్రాంతంలోని నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలను ఆనుకొని ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో శాకాహార జంతు గణనను బుధవారం ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 20 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో శాకాహార జంతు గణన చేపట్టినట్లు తెలిపారు. జంతువుల పాద ముద్రలు, ట్రాప్ కెమెరాలు తదితర పద్ధతుల ద్వారా జంతు గణన ఉంటుందన్నారు. నాగార్జున సాగర్ పరిధిలోని 40 బీట్‌లలో 80 మంది అటవీ శాఖ అధికారులతో మూడు రోజులపాటు ఈ గణన చేపట్టి వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు. అలాగే అటవీ ప్రాంతంలో కలపను తరలించినా, అటవీ జంతువులను వేటాడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓలు భాస్కర్, సాయిప్రకాశ్, సెక్షన్ ఆఫీసర్లు రాగ్యా నాయక్, సైదులు, శ్రీదేవి, కవిత, చంద్రకళ, ప్రీతి ఉన్నారు.